# ఆచారం

— హోతా పద్మినీదేవి

పరంధామ్ చనిపోయి ఆవేళ్టికి పది రోజులు. బ్రతికి వున్న పార్వతిని జీవచ్ఛవంలా బ్రతకమని నిర్దేశించినదీ ఆ రోజు నుంచే.

ఆ ఇంట్లో మూలగా సూర్యరశ్మి కూడా సోకని ఆ గదిలో కూర్చుని వుంది పార్వతి. ఘనీభవించిన శూన్యం! కరడుకట్టిన నిశ్శబ్దం! వేదన, రోదన ఆమె నేస్తాలు!

ఎప్పుడూ నుదుట ఎర్రని తిలకంతో పార్వతీదేవిలా వుండే ఆమె నుదట బొట్టు యివాళ శాశ్వతంగా తుడిచెయ్యబడింది. మెడలో తాళి, నల్లపూసలు, కాలి మెట్టెలు లేని ఆమె మంచు దెబ్బ తిన్న మల్లెపువ్వులా వుంది. విధి విసిరేసిన రెక్కలు తెగిన పావురంలా వుంది.

ఒక స్త్రీ జీవితంలో భర్త మరణం కంటే విషాదకరమైన ఉపసంహారం ఏం వుంటుంది?

పార్వతి తన దుస్థితికి తనలో తనే కుమిలిపోతోంది. ప్రస్తుత తన పరిస్థితి కంటే ప్రస్తుతం ఆమె వెక్కువగా బాధిస్తున్నది దప్పిక బాధ! తెల్లవారు ఝామున ఎప్పుడో తులసమ్మగారు ఇచ్చిన కాఫీ! కడుపులో ప్రేగులు ఆకలికి రొద చేస్తున్నాయి. పార్వతి ఎండిపోయిన పెదవులని నాలికతో తడిచేసుకుంటూ ఆలోచించసాగింది.

"ఇద్దరు పిల్లలతో భర్తలేని సంసారాన్ని ఎలా నెట్టుకురావాలి? పెద్దకర్మ అయ్యాక ఎవరినైనా తోడు తీసుకుని భర్త పనిచేసే ఆఫీసులో ఏదైనా ఉద్యోగం ఇస్తారేమో అడగాలి! పిల్లలని చదివించాలి!"

భర్త పోగానే ఆత్మహత్య చేసుకోవాలనే కోరిక కలిగింది పార్వతికి. దుర్భలమైన మనసులో చచ్చిపోవాలనే కోరిక ఉధృతమవుతుండగా, ఏదో పిరికితనం ఆ పని చెయ్యనివ్వలేదు. పిరికితనం అనేకంటే పిల్లలపై మమకారం అంటే బాగుంటుందేమో!

పిల్లలు గుర్తురాగానే పార్వతి కళ్ళలో నీళ్లూరాయి. "పిల్లలు అమ్మకావాలని ఏడుస్తున్నారేమో! పెద్దపిల్ల ఫర్వాలేదు. ఎవరేం చెప్పినా వింటుంది. రెండోదే మరీ చంటిపిల్ల! తన కోసం ఏడుస్తుంది.' '

"ఇంకెంత? మరో గంట గడిస్తే తను వున్న ఈ గది తలుపులు తెరుస్తారు. తన పిల్లలని తన దగ్గరకి చేరుస్తారు. అటు నుంచి ఇటు తిరగబోయిన పార్వతి గుండెల్లో కలుక్కుమంది.

ఎడమవైపు ఛాతీలో సన్నగా నెప్పి మొదలయింది. గత నాలుగు నెలలుగాఆ గుండెనెప్పికి వైద్యం చేయించుకుంటున్న పార్వతికి మందు బిళ్ళలు ఆ గదికి అవతలి వైపున్న తమ గదిలో వున్నాయని తెలుసు. "ఎవరిని పిలవాలి? ఎవరిస్తారు తనకి మందు? భర్త మరణించినప్పుడు వచ్చిన గుండెనెప్పితో తన ప్రాణం పోతే బాగుండునని మనస్ఫూర్తిగా కోరుకుంది. ఇప్పుడు నిజంగానే తను చనిపోతుందా?" పార్వతి వెన్నులో సన్నని జలదరింపు.

పరంధామ్ మరణానికి బావురుమని ఏడ్చే బంధువులు ఎవరూ లేరు ఆ ఇంట్లో. కాని ఫ్రీగా వస్తే ఫినాయిలైనా తాగగలిగే రాబందుల లాంటి బంధువులు వున్నారు. ప్రస్తుతం వాళ్ళంతా వంటగదిలో ఉప్మా గుండిగ చుట్టూ వున్నారు.

పార్వతి గుండెని చేత్తో అదుముకుంది. సన్నగా మొదలయిన నెప్పి క్షణక్షణానికి ఉధృతమవసాగింది.

"తను చావకూడదు. బ్రతకాలి. పిల్లలు... తన పిల్లలు... ఆక్రోశిస్తోందామె మనసు. బాధతో మెలికలు తిరుగుతోంది.

'పిన్నీ! తులసమ్మ పిన్నీ!' ఆ పిలువు ఆమె స్వరం నుంచి ఆక్రందనలా ధ్వనిస్తోంది.

ఇంకెవరిని పిలిచినా ఆ గదిలోకి ఎవరూ రారని తెలుసు పార్వతికి. దురదృష్టవశాత్తూ బంధువర్గంలో తులసమ్మగారు తప్ప వితంతువు లెవరూ లేరు.

మంచి ఘడియలలో తప్ప పార్వతిని ఎవరూ చూడకూడదు అనే ఆచారం వుంది మరి!

పార్వతి మరింత గట్టిగా తులసమ్మగారిని పిలవాలని నోరు తెరిచింది. కాని, ఆమె నోటి నుంచి పిలుపుకి బదులుగా బాధని భరించలేని ఆర్తనాదం వెలువడింది. కళ్ళ ముందు మృత్యుదేవత వికటాట్టహాసం చేస్తూ కనిపించింది. ప్రాణం పోవడం తెలుస్తూనే వుంది.

గది తలుపులు తెరిచి, ఒక్కొక్కరుగా ఆ గదిలోకి వచిచన ముత్తైదువలు నిర్జీవంగా వున్న పార్వతమ్మని చూసి నివ్వెరపోయారు.

"ప్రాణం వుందేమో చూడండి. డాక్టర్ దగ్గరకి తీసుకెళ్దాం."

"ప్చ్! లాభం లేదు. ప్రాణం పోయింది."

"ఎంత అదృష్టవంతురాలు! భర్తపోయిన రోజులు వెళ్ళకుండానే తనూ పోయింది."

"పోనీలే! వైధవ్య బాధను ఎక్కువ రోజులు అనుభవించకుండానే పోయింది."

"ఏ మందు మింగో చచ్చిపోయివుంటుంది! పిల్లల కోసమైనా బ్రతకాలనుకోలేదూ?"

వింటున్న పార్వతి ఆత్మ ఘొల్లున ఘోషించింది.

"నాకు బ్రతకాలని వుందర్రా! చనిపోవాలని లేదు. నేను ఆత్మహత్య చేసుకోలేదు! అర్థంలేని ఆచారాలతో మీరే నా ప్రాణం తీసారు? మీరే నన్ను హత్య చేసారు."

◆

